కాంగ్రెస్ పార్టీ, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి గా ముగడ వెంకటరమణ తొలి నామినేషన్

విశాలాంధ్ర-బొబ్బిలి : నియోజకవర్గంలో బాడింగి మండలం ముగడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముగడ వెంకటరమణ గురువారం రెవిన్యూ డివిజనల్ అధికారి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదిమూలము సాయి శ్రీ వద్ద కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎన్నికల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పరిశీలన చేశారు. ఎన్నిక నామినేషన్ కార్యక్రమంలో న్యాయవాది తుమరాడ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంగళ నారాయణరావు, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటరమణ సతీమణి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

21న ఎస్.కోటలోచంద్రబాబు రోడ్‌షో

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఈనెల 21వ తేదీన ఎస్.కోటలో నారా చంద్రబాబు నాయుడు రోడ్ షో సందర్భంగా తెలుగుదేశం పార్టీ సెంట్రల్ టీం సభ్యులతో కలిసి సభా ప్రాంగణాన్ని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-భోగాపురం: నేడు కెవి నాథవలస ఫీడర్ నుండి ముక్కాం ఫీడర్ పరిధిలో క్రమానుగతంగా మెయింటెనెన్స్ చేపడుతున్నామని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్ బాబు తెలిపారు. ఈ కారణముగా 19న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగనుంది. ముంజేరు, మెట్ట సబ్బన్నపేట, సరివలస, జగ్గయ్యపేట, అప్పన్న పేట, ధన్నాలపేట ,పిట్టపేట, చేట్లపేట, కొయ్యపేట ,కారిగొల్ల పేట గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని జి.సురేష్ బాబు తెలిపారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

తొలిరోజు అసెంబ్లీ స్థానాలకు 10 ఎంపి స్థానాలకు 2 నామినేషన్లు దాఖలు
అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభ మయ్యింది. తొలి రోజు గురువారం విజయనగరం పార్లమెంటు స్థానానికి రెండు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 10 నామి నేషన్లు దాఖలయ్యాయి. మొదటిరోజు నామినేషన్ల ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా పూర్తయ్యింది. ఆర్‌ఓ కార్యాలయాలకు వంద మీటర్ల దూరంలోనే, పోలీసులు అభ్యర్థుల వాహనాలను నిలిపివేశారు. అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే ఆర్‌ఓ కార్యాలయాల లోపలికి అనుమతించారు. అన్ని ఆర్‌ఓ కార్యాలయాల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేశారు. సిసి కెమేరాల నిఘా మధ్య నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. కలెక్టరేట్ సహా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అభ్యర్థుల సహాయం కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్‌లవద్ద నామినేషన్ పత్రాలను ఏఆర్‌ఓలు, ఇతర అధికారులు ముందుగా పరిశీలించారు. మొత్తం నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే, కలెక్టరేట్‌లో నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, విజయనగరం పార్లమెంటు స్థానం రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రారంభించారు. తొలిరోజు ఇద్దరు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. యుగ తులసి పార్టీ తరఫున పార్లమెంటు అభ్యర్థిగా శంబాన శ్రీనివాసరావు, సమాజ్‌వాది పార్టీ తరఫున ఎస్.అచ్చియ్యనాయుడు నామినేషన్లు వేశారు. వీరిద్దరూ చెరోసెట్‌ను దాఖలు చేశారు. ముందుగా అభ్యర్థుల నామినేషన్ పత్రాలను హెల్ప్ డెస్క్ వద్ద పార్లమెంటు స్థానం ఏఆర్‌ఓ సుమబాల తనిఖీ చేశారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. విజయనగరం తాశిల్దార్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను విజయనగరం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ప్రారంభించారు. ఇద్దరు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. సమాజ్‌వాది పార్టీ తరఫున పెనుమత్స కరుణాకర్, స్వతంత్ర అభ్యర్థిగా మండల శ్రీనివాసరావు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యింది. తొలిరోజు ఇద్దరు అభ్యర్థుల నుంచి నెల్లిమర్ల తాశిల్దార్ కార్యాలయంలో ఆర్‌ఓ ఎం.నూకరాజు నామినేషన్లను స్వీకరించారు. వైకాపా అభ్యర్థులుగా బడ్డుకొండ అప్పలనాయుడు 3 సెట్లను, బడ్డుకొండ పద్మావతి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.బొబ్బిలి నియోజకవర్గంలో ఒక నామినేషన్ దాఖలయ్యింది. స్వతంత్ర అభ్యర్థిగా ముగడ వెంకటరమణ నామినేషన్ వేయగా, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఓ ఏ.సాయిశ్రీ తన కార్యాలయంలో నామినేషన్ స్వీకరించారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ తొలిరోజే ప్రారంభమయ్యింది. ఇద్దరు అభ్యర్థులనుంచి రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ నామినేషన్లను స్వీకరించారు. జాతీయ జనసేన పార్టీ తరఫున యాల్ల వెంకటరావు, స్వతంత్ర అభ్యర్థిగా కొట్యాడ లోకాభిరామకోటి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. చీపురుపల్లి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు బి.శాంతి, ఎల్.జోసెఫ్, ఎం.వి.సూర్యకళ, ఏఆర్‌ఓలు నామినేషన్ల స్వీరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్దంగా ఉన్నారు.

వెండి బుట్ట కిరీటం బహుకరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలోని శివాలయం వీధిలో గలశ్రీ పైడితల్లి దేవస్థానంకు (దత్తాలయం) చెందిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అలంకరణ కోసం గురువారం బాలాజీ భక్తమహిళాసమాజంభక్తులు ఒకకేజి 225 గ్రాములు గల వెండి బుట్ట కిరీటం దేవస్థానంకు అందజేశారు. కిరీటం దేవస్థానం సీనియర్ సహాయకులు ఏడుకొండలు కు సమాజం సభ్యులు అందజేశారు.కిరీటాన్ని ఆలయం అర్చకులు పి.శ్రీనివాసాచార్యులకు శ్రీ స్వామి వారికి దేవస్థానం అందజేసింది. భక్తసమాజం 26 ఏళ్ళుగా విష్ణు సహస్రనామ పారాయణలు, సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు సభ్యులుతెలిపారు.

అదితి గజపతికి మద్దతుగా ప్రచారం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు మద్దతుగా కూటమికి చెందిన మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు విజయనగరం పట్టణంలోని 31వ డివిజన్లో గురువారం ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థికి ఓటువేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయనగరం టీడీపీ నాయకులు ఐవిపి రాజు , గోగుల రమేష్, బెవర భరత్, వర్మ, బలరాం, వేణు, రమేష్, రవి ,సందీప్, బిజెపి నాయకులు ఇప్పిలి గోపాలకృష్ణ, పచ్చిపాల శ్రీను, షావుకారి జగన్నాధం, జనసేన తరుపున టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమ గీతం పాడాలి

ఉమ్మడి అభ్యర్థి కె.శ్రీనివాస్

విశాలాంధ్ర-దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం పాచలవలస గ్రామానికి చెందిన సుంకరి సత్యం, సిరిపురం చిట్టి అప్పల నాయుడు, సుంకరి శ్రీరామమూర్తి, సుంకరి భాస్కరరావు,సుంకరి గోపాల్, సుంకరి అప్పలనారాయణ, సుంకరి కృష్ణ, సుంకరి గోవింద, సాసుబిల్లి శ్రీరామమూర్తి, గెద్ద నారాయణ వీరితోపాటు 120 కుటుంబాలు,అదే విధంగా చినకాద గ్రామానికి చెందిన 150 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మే 13న జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపిని గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బోడసింగి సత్తిబాబు, ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తి, గుషిడి జగన్నాథం, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19న విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా మీసాల గీత నామినేషన్

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత నామినేషన్ వేయనున్నారు. ఆత్మగౌరవం నినాదంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానన్నారు. 2019లో సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తనకు తెదేపా కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా టికెట్ వేరొకరికి కేటాయించిందన్నారు. అయినప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి అంకిత భావంతో పనిచేశానన్నారు. ఈ ఎన్నికలలో కచ్చితంగా ఇస్తామని చెప్పి చివరికి ఇవ్వకుండా అవమానించారన్నారు. మీ ఆడబిడ్డగా ఎన్నికల బరిలో దిగానని, ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజయనగర నియోజకవర్గం ప్రజలను కోరారు.

వైసిపి తోనే సంక్షేమం అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-గజపతినగరం: వైసిపి తోనే సంక్షేమం అభివృద్ధి సాధ్యపడుతుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు వరుస సాయి గురు నాయుడు అన్నారు. గురువారం గణపతి నగరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఎంపీ వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తవుడు మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు సర్పంచ్ నరవ కొండమ్మ ఉప సర్పంచ్ కర్రి రామునాయుడు పార్టీ నాయకులు మండల సురేష్ సామంతుల పైడిరాజు బెల్లాన త్రినాధ రావు కరణం ఆదినారాయణ రేగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ నామినేషన్

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గ తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ నేడు ఉదయం 11 గంటల రెండు నిమిషాలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వచ్చి వినాయకుని ఆలయం వద్ద చేరుకొని నామినేషన్ ప్రక్రియ తాసిల్దార్ కార్యాలయంలో చేపడతారు అనంతరం టిడిపి పార్టీ కార్యాలయం ఎదురుగా గల వేదిక వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు కావున టిడిపి జనసేన బిజెపి కుటుంబ సభ్యులు అందరూ ఉదయం 9:30 కు చేరుకోవాలని తెలిపారు.

నేడు లోకం మాధవి నామినేషన్



విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఈనెల 19న నెల్లిమర్ల నియోజకవర్గం ఎన్‌డిఏ అభ్యర్థి లోకం నాగ మాధవి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఉదయం 12 గంటలకు ముహూర్తం ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముందుగా నాగమాధవి రామతీర్థంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి ర్యాలీగా వచ్చి నెల్లిమర్లలో నామినేషన్లు దాఖలు చేయనున్నారు. నాగ మాధవి నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి 2019లో జనసేన తరఫున ఎమ్మెల్యే గా పోటీ చేశారు. త్రిముఖ పోటీలో సుమారు 8వేలు ఓట్లు తెచ్చుకున్నారు. ఈ సారి కూటమి అభ్యర్థిగా పోటీలో దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

పోలీసు సంక్షేమ పాఠశాలలో మూడు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు : ఎస్పీ దీపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎఆర్ పోలీసు లైన్స్ నడపబడుచున్న పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. పాఠశాలలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మ్యాథ్మెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీతోపాటు ఇంగ్లీషు సబ్జెక్ట్ ను కూడా భోదించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే ఒరిజినల్ ధృవ పత్రాలు మరియు రెజ్యూమ్ తీసుకొని ఏప్రిల్ 26, ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించబోయే టీచింగు డెమో మౌఖిక పరీక్షకు హాజరుకావాలన్నారు. ఈ ఉపాధ్యాయ పోస్టులకు బి. ఈడి విద్యార్హతతోపాటు భోదనానుభవం కలిగి, ఆంగ్లంలో విద్యాభోదన చేయగలగాలన్నారు. ఈ ఉపాధ్యా ఉద్యోగాలకు ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు ఏప్రిల్ 26న ఉదయం 10 గంటలకు పోలీసు వెల్ఫేర్ స్కూలులో నిర్వహించే టీచింగ్ డెమో మరియు మౌఖిక పరీక్షకు నేరుగా హాజరుకావచ్చునన్నారు. ఈ ఉద్యోగాల కొరకు మరింత సమాచారం, సందేహాల నివృత్తి కోసం స్కూల్ హెడ్ మాస్టర్ - 9491799315 లేదా రిజర్వ్ ఇన్స్పెక్టర్ - 9121109485, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ - 9121109484 ను సంప్రదించ వచ్చునని తెలిపారు.

మండే ఎండలలో తగ్గని వైకాపా ఎన్నికల జోరు

గ్రామ గ్రామాన రాజేష్ ఘన స్వాగతం

విశాలాంధ్ర-రాజాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డా.తలే రాజేష్ రాజాం మండలం బొమ్మినాయుడు వలస పంచాయతీ లి విజయరాంపురం, బురాడ పేట గ్రామలలో ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి ప్రజలను, ఆప్యాయంగా పలకరిస్తూ వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఈ ఐదేళ్ళ పాలనలో ప్రజలకు చేసిన మంచినీ వివరించారు. మళ్ళీ సంక్షేమ , అవినీతిరహిత పాలన రావాలంటే ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి మరల ముఖ్యమంత్రి గా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నీ గెలిపించాలని కోరారు. మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్‌గుర్తుపై వేసి విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ ని, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థిగా డా. తలే రాజేష్ అనే నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లావేటి.రాజగోపాల్ నాయుడు, జడ్పిటిసి బండి.నరసింహులు, పిఎసిఎస్ అధ్యక్షులు వాకముళ్ళ.చిన్నం నాయుడు, వ్యవసాయ మండలి ఛైర్మన్ కోనారి.అప్పారావు, జెసిఎస్ మండల కన్వీనర్ కామోధుల.శ్రీరంగం , పిఎసిఎస్ డైరెక్టర్ ముదిలి. జనార్ధన రావు, నక్క.ఉమామహేశ్వర రావు, యూత్ పార్టీ అధ్యక్షులు గెద్దాపు.అప్పల నాయుడు, వంజరాపు విజయకుమార్, వైస్ ఎంపీపీ లు యాలాల వెంకటేష్ ,నక్క వర్షిణి మోహన్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు సామంతుల వెంకట అప్పలనాయుడు, ఏఎంసీ డైరెక్టర్ బింగి సూర్యనారాయణ, ఓలేటి. గణపతి, కెల్ల సతీష్, యందవ.చిన్న , మరియు వివిధ హెూదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఎంపిటిసిలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

41 నుండి 50 డివిజన్ల సమీక్ష సమావేశం



విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: అశోక్ బంగ్లాలో 41వ నుండి 50వ డివిజను లకు సంబంధించిన డివిజన్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్ అభ్యర్థులు, యువత కమిటీ, మహిళా కమిటీ, యూనిట్ ఇంచార్జ్, బూత్ ఇంచార్జ్ లతో విజయనగరం పార్లమెంటు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం శాసనసభ కూటమి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్లలో గల నాయకులు మరియు కార్యకర్తలు బూత్ ల వారీగా ప్రతి ఇంటికి వెళ్లి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు, కళలకు రెక్కలు పథకం, వీటితోపాటు రూ.4,000/- ల పింఛను, దివ్యాంగులకు రూ.6,000/- ల పింఛను, చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లి కానుక ఇలా అన్ని హామీలను వివరించాలని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికలలో ఎంపీ మరియు ఎమ్మెల్యే రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేయించాలని కోరారు. అదేసమయంలో ప్రతి ఓటరు యొక్క వెరిఫికేషన్ ను పూర్తి చేయాలని, 85 ఏళ్ళు దాటిన ఓటర్లను, 18 - 24 సం.ల వయస్సు గల కొత్త ఓటర్లను గుర్తించడం మరియు కుటుంబ సాధికార సారధులు (కెఎస్ఎస్) నియామకం త్వరితగతిన పూర్తిచేసి పార్టీ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. సమావేశంలో డివిజన్ల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

59 మంది వాలంటీర్లు రాజీనామా...

ఎంపీడీఓ నిశ్చల

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వాలంటీర్లు 59మంది ఇప్పటి వరకు తమ వాలెంటీర్ల పదవులకు రాజీనామా చేశారని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని నిశ్చల తెలిపారు. ఈ మేరకు మండలంలోని 304 మంది వాలంటీర్లు విధులు నిర్వహిస్తుండగా వీరిలో బల్లంకి గ్రామానికి చెందిన 10మంది వాలంటీర్లు, బానాది గ్రామానికి చెందిన 18మంది వాలంటీర్లు. చామలాపల్లి గ్రామానికి చెందిన 5గురు వాలంటీర్లు,దబిరాజు పేటకు చెందిన ముగ్గురు వాలంటీర్లు. పాటూరు గ్రామానికి చెందిన 11మంది వాలంటీర్లు, వావిలపాడు గ్రామానికి చెందిన 12మంది వాలంటీర్లు, వారి వాలంటీర్లు తమ వాలంటీర్ల పదవులకు రాజీనామాలు అందించారని ఎంపీడీఓ తెలిపారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను, మండల ప్రత్యేక అధికారికి పంపించి ఆమోదించడం జరిగిందని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి కొట్యాడ లోకాభి రామకోటి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అన్ని విధాల వెనుకబడిన శృంగవరపుకోట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి కొట్యాడ లోకాభి రామకోటి అన్నారు. ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయంలో గురువారం శృంగవరపుకోట ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎస్.కోట ఆర్కే గ్రాండ్ ఫంక్షన్ హాల్ నుంచి దేవి జంక్షన్ వరకు వందలాది మంది ప్రజలు, కాంగో డప్పు వాయిద్యాల నడుమ ర్యాలీగా వచ్చి దేవి ఆలయంలో కొట్యాడ లోకాభి రామకోటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన న్యాయవాదులు, ప్రతిపాదకుడుతో వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణకు రామకోటి నామినేషన్ పత్రాలను అందజేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలాల్లో ప్రధాన పార్టీలకు గట్టి పోటీనిచ్చేందుకు గ్రామాల్లో తిరుగుతూ తన గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. సమాజంలో ఉన్న కష్టనష్టాలను ప్రత్యక్షంగా చూశానని, పేదల కష్టాల విలువ తెలుసు కాబట్టే వారి అభివృద్ధికి పాటుపడతా అని ప్రకటించారు. అభివృద్ధిలో శృంగవరపుకోట నియోజకవర్గాన్ని నెంబర్ వన్ చేస్తాననే నినాదంతో ముందుకు సాగుతానని తెలిపారు. నాలాంటి వ్యక్తి ఎమ్మెల్యే కావాలని ప్రతి ఒక్కరూ ప్రోత్సహిస్తున్నారన్నారు. అందరినీ కలుపుకొని పోయే మేనిఫెస్టోలో మహిళలు, విద్యార్థులు, రైతులు, ఇతర అన్ని వర్గాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసీపీ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా గెలిచిన పార్టీకి మద్దతు ఇచ్చి నియోజకవర్గ అభివృద్ధికి సాధ్యమైనన్ని నిధులు తీసుకొస్తానని కొట్యాడ లోకాభి రామకోటి స్పష్టం చేశారు.

సమాజ్ వాదీ పార్టీ తరుపున కరుణాకర్ నామినేషన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం. తొలిరోజు గురువారం సమాజ్ వాదీ పార్టీ(ఎస్ పీ) తరపున పెనుమత్స కరుణాకర్ నామినేషన్ దాఖలు చేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ నామినేషన్ పత్రాలను స్వీకరించారు. కాగా న్యాయవాది వృత్తిలో ఉంటూ పలు సామాజిక, న్యాయ సేవా కార్యక్రమాలు నిర్వహించే యువ నాయకుడు కరుణాకర్ ఒక సామాన్య కుటుంబ నేపథ్యం కలిగినవాడు. ఇటీవల నియోజక వర్గంలో సమాజ్ వాదీ పార్టీ తరుపున ఆయన ప్రచారం నిర్వహిం చారుచారు. నామినేషన్ వేసిన సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ యువతకు స్ఫూర్తిగా తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. సమాజ్ వాదీ పార్టీ తరుపున బరిలో దిగుతున్న తనను 'సైకిల్ పంపు' గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లుకి విజ్ఞప్తి చేశారు.

ఫ్యాను గుర్తుకి ఓటు వేసి ఎమ్మెల్యే గా తనను ఎంపీగా బెల్లానను గెలిపించండి : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను శత శాతం అమలుచేసి అవినీతి రహిత పాలన అదించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని రెండోసారి అధికారం లోకి రావడానికి అండగా ఉండాలని ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణం 13వ వార్డులో. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా యాదవ వీధి జంక్షన్ నుంచి. యాతవీధి, మహారాణిపేట వీధులలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పల నాయుడు ఇంటింటి ప్రచారం చేశారు. రానున్న మే.13 వ. తారీఖున జరగబోయే ఎన్నికలలో నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన్నప్పల నాయుడు తనను. ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ కి.మీ అమూల్యమైన ఓటు ముద్ర ఫ్యాన్ గుర్తుపై వేసి మమ్ములను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్ మహాశయులను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళి కృష్ణ రావు, జెసిఎస్ కన్వీనర్లు తమ్మిరెడ్డి దామోదర్, రేగేటి విశ్వేశ్వరరావు, న్యాయవాది రూంకానా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో నేటి ఎన్నికల నామినేషన్ జయప్రదం చేయండి : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: నియోజకవర్గ ఎమ్మెల్యే వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మే 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయుచున్న నేపథ్యంలో ఈనెల 19 అనగా శుక్రవారం ఉదయం 11:00 గంటలకు బొబ్బిలి గ్రోత్ సెంటర్ ఏపీఐఐసీ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ దాఖలు చేస్తున్నారని ఉదయం 8గంటలకు బొబ్బిలి నియోజకవర్గంలో గల వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు,మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు,మండల పార్టీ అధ్యక్షులు,జేసిఎస్ కన్వీనర్లు,యువజన అధ్యక్షులు,వివిధ కార్పొరేషన్ చైర్మన్లు,డైరెక్టర్లు,పిఎసిఎస్ అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు,సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహ సారథులు, ఎమ్మెల్యే శంబంగి అభిమానులు,వైసిపి నాయకులు,కార్యకర్తలు హాజరై ఆశీర్వదించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు నామినేషన్ కార్యక్రమం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం 10:59 నిమిషాలకు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నారు. ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తర్ఫున్న ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు దాఖలు చేయుటకు ఉదయం 9 గంటల నుండి ఎస్.కోట ఆకుల డిపో దగ్గర నుండి దేవి జంక్షన్ కూడలి వరకు భారీ ర్యాలీగా వెళ్ళుటకు నియోజకవర్గంలో ఉన్న వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్లు, పీఏసీఎస్ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పిటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీ లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతీ ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కోలాహలంగా బడుకొండ నామినేషన్

తరలివచ్చిన వేలాది మంది వైసిపి శ్రేణులు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వైఎస్సార్సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం కోలాహలంగా తన నామి నేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి మండుటెండను లెక్కచేయకుండా వేలాది సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, వైసీపీ పూసపాటిరేగ మండల శాఖ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైసిపి జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, బడ్డుకొండ కుటుంబ సభ్యులు మణిదీప్, ప్రదీప్, సిరి సహస్రతో కలిసి తన నామినేషన్ పత్రాలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం నూకరాజుకు బడ్డుకొండ అందజేశారు. ఆయనతో పాటు ఆయన సతీమణి బడ్డుకొండ పద్మావతి కూడా నామినేషన్ దాఖలు చేశారు. బడ్డుకొండ నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని నెల్లిమర్ల నగర పంచాయతీ, నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల నుంచి వేలాది సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ శ్రేణులు, అభిమానులతో నెల్లిమర్ల పట్టణం కిక్కిరిసి పోయింది. ఇదిలా ఉంటే బడ్డుకొండ అప్పలనాయుడు మూడు నామినేషన్ సెట్లు, పద్మావతి రెండు సెట్లు నామి నేషన్లు అంద జేశారు. అనం తరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొన్నటి వర కూ విదేశాలలో ఉండే ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని బడ్డుకొండ ఎద్దేవా చేశారు.

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు ప్యాకేజీ ఇచ్చి, మాధవి ఎమ్మెల్యే సీటు కొనుక్కున్నారని ఆరోపించారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో మళ్ళీ వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటట్లు దోహదం చేస్తాయన్నారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం నిర్వహించిన సభలో వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రానికి తలమానికమైన భోగాపురం విమానాశ్రయాన్ని త్వరితగతిన నిర్మిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి, ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శ్రీనివాసరావు కోరారు.

ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పూడి హరి

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి ఆర్ఇసిఎస్ పరిధిలో గల 33 కెవి గరివిడి గర్భాం ఫీడర్ మెయింటినెన్స్ పనులు కారణంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఏపీ ఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఊడి హరి తెలిపారు. తేదీ 19.04.2024 అనగా శుక్రవారం నాడు 33 కెవి గరివిడి గర్భం ఫీడర్ మెయింటెనెన్స్ పనులు కారణంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ క్రింది తెలిపిన గ్రామాలు వెదుళ్ళవలస , ఆవగూడెం, కుమారంపాలవలస, తాటిగూడ, గెడ్డపువలస, వి పిరేగా, లవిడాం, పెదబంటుపల్లి, రేగటి, రౌతుపేట, డి.కనపాక, గెడ్డపు వలస, రూరల్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి అత్యవసర పనులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పూడిహరి తెలియజేశారు.

కోండ్రు నామినేషన్ కు జనసమీకరణ

విశాలాంధ్ర-వంగర : రాజాం నియోజక వర్గతెలుగు దేశం పార్టీ అభ్యర్థి మాజీ మంత్రి నేడు రాజాం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గానామినేషన్ వేయనున్న సందర్భంగా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వంగర మండలం నుండి తెలుగు దేశం పార్టీ నాయకులు జనసమీకరణ కు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతీ మండలం నుంచి బారీ ఎత్తున తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులను తరలించటానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.మండలం లో ఉన్నటువంటి మండల తెలుగుదేశం సీనియర్ నాయకులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు కార్యకర్తలుజనాలను తరలించే పనిలో నిమగ్నమయ్యారు. అంతేకాక నియోజకవర్గంలో తతిమా మూడు మండలాలు సంతకవిటి, రాజాం రూరల్, అర్బన్, రేగిడి మండలాల నుండి పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు సమాచారం.నాలుగు మండలాల నుండి సుమారుగా 60 వేల వరకూ జనసమీకరణచేయాలని నియోజకవర్గ నాయకులు కోరినట్లు తెలిసింది. దీంతో ఈ పనిలో నియోజకవర్గంలో గల ఆయా మండలాల ప్రధాన నాయకులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. కోండ్రు నేడు శుక్రవారం నాడు ఉదయం 9 గంటలకు రాజాంపోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన నాయకులు, బిజెపీ నాయకులు,కార్యకర్తలుఅభిమానులతో భారీ సంఖ్యలో మహిళలతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను శ్రీకాకుళం రోడ్ రాజాం తహసీల్దార్ కార్యాలయం లోరిటర్నింగ్అధికారికి సమర్పించనున్నారు.

ఎంపీపీ ప్రతినిధి సమక్షంలో టీడీపీను విడి వైయస్సార్ కాంగ్రెసు పార్టీ లో పలువురి చేరిక

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం దిబ్బగుడి వలస గ్రామానికి చెందిన కటికి లక్ష్మణరావు, ఈదుబిల్లి భాస్కరరావు,గాధపు ప్రసాద్, నగిరెడ్డి కొండలరావు సర్పంచ్ చింతల రామారావు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే సోదరులు,ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీని వీడి వైస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నారు.వారికి ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల్ నాయుడు పార్టీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు గెలుపుకు కృషి చేయాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన వ్యక్తులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు,చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమయ్యి స్వచ్ఛందంగా పార్టీలో చేరమన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల రామారావు,యువత అధ్యక్షుడు నెమాపు వెంకటేష్, సీతయ్యపేట సర్పంచ్ ప్రతినిధి బోను తిరుపతి,వైసీపీ నాయకులు వెన్నెల అచ్యుతరావు,చప్ప శేఖర్ తదితరులు ఉన్నారు.

తెలుగుదేశం నుంచి 30 కుటుంబాలు వైకాపాలో చేరిక

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆకులపేట గ్రామం నుంచి పిన్నింటి వారి కుటుంబ సభ్యులు మీసాల వారి కుటుంబ సభ్యులు పతివాడ వారి కుటుంబ సభ్యులు షేక్ అప్పన్న కుటుంబ సభ్యులు కొండేటి వారి కుటుంబ సభ్యులు 30 కుటుంబాలు మండల పార్టీ అధ్యక్షులు ఇప్పిలి అనంతరం జిల్లా కార్యదర్శి వల్లి రెడ్డి శ్రీనువాసనాయుడు మాజీ జడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు జిల్లా యువజన ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ సమక్షంలో వైయస్సార్ పార్టీలో జాయిన్ అవడం జరిగింది.ఈ రాష్ట్రం లో వైస్సార్ పార్టీ అధికారం లోకి వచ్చి మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టడం ఈ రాష్ట్రము లో వున్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు అవసరం అని అన్నారు, చీపురుపల్లి నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చేసి ప్రజల కష్ట సుఖాల్లో నిత్యం అందుబాటులో వుండే నాయకులు శాసనసభ్యులు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి బొత్స సత్యన్నా రాయణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ లను పెద్ద ఎత్తున ప్రజలు మంచి మెజారిటీ తో గెలిపించడానికి సిద్ధంగా వున్నారు అని అన్నారు, తెలుగుదేశం నాయకులు ఎన్నికలు అప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారు అని ఈ నియోజకవర్గం లో తెలుగుదేశం కి 5 సవత్సరాలకి ఒక ఏమ్మెల్యే అభ్యర్థి ని ఎక్కడినుంచో దిగుమతి చేసుకొని ఎన్నికలు అయిపోయాక మరి కనిపించరు అని అటువంటి అభ్యర్థి కి ఓటు వేసి మీ ఓటు లు వృధా చేసుకో వద్దు అని అన్నారు, ఈ కార్యక్రమం లో మండల వైస్సార్ పార్టీ అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు బెల్లానవంశీ, మీసాల సాయి, మీసాల సత్యన్నారాయణ, మీసాల గౌరీ, మీసాల హరి ,రాంబాబు ఆకుల పేట నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల ఆధ్వర్యంలో 70 కుటుంబాలు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని పొలమర శెట్టి వీధిలో గౌరీ సేవా సంఘం కళ్యాణ మండపంలో గౌరి సేవా సంఘం(గౌరి యూత్) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 70 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన బొడ్డేటి భాస్కర్, అల్ల భాస్కర్, కాళ్ళ మణికంఠ, సరిస, నవీన్, పొలిమేర శెట్టి శివ, శెట్టి లక్ష్మి, దాడి జగ్గయ్య, జగయ్య బాబు, దేవి, అన్నపూర్ణ, సారపాటి శ్రీను, మల్ల నాయుడు, కర్రి లక్ష్మి,బీశెట్టి రాజు, కర్రీ అప్పారావు, ముసినాన రాము,ఆదారి బుజ్జి,లక్ష్మి,శారద,సారపాటి సరోజిని తదితరులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి మాట్లాడుతూ ఈ ముఖ్యమంత్రి మన జీవితాలతో ఆడుకుంటున్నాడని ఉద్యోగాలు లేవు, రైతులకి గిట్టుబాటు ధరలు లేవు, విద్యార్థులకి సరిగ్గా ఫీజ్ రియంబర్స్మెంట్ లు లేవు కాబట్టి మనందరి కోసం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని వెల్లడించారు. మే 13వ తారీఖున జరగబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు కూడా సైకిల్ గుర్తుపై వేసి ఇద్దరు అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ రాష్ట్ర భవిష్యత్తు కోసం మీ తెలుగుదేశం జనసేన బిజెపి మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నందున కూటమి అభ్యర్థులని సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, ఎస్.కోట మండల తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పాటూరులో 11మంది వాలంటీర్ల రాజీనామా

మండల పరిషత్ అభివృద్ధి అధికారిని నిశ్చల వెల్లడి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని పాటూరు గ్రామ సచివాలయంలో పరిధిలోని పాటూరు గ్రామపంచాయతీలో గల 11మంది గ్రామ వాలంటీర్లు మూకుమ్మడిగా తమ పదవులకు రాజీనామా చేశారు.ఈ మేరకు గురు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సంధ్యకు అందజేశారు.వాలంటీర్ల రాజీనామాలు ఆమోదం కొరకు పంచాయతీ కార్యదర్శి సంధ్య మండల పరిషత్ అభివృద్ధి అధికారికి సిఫార్సు చేయగా, ఆమె మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణకు సిఫార్సు చేశారు.ఈ సందర్భంగా గ్రామ వాలంటీర్లు మాట్లాడుతూ ప్రజా రంజకమైన పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు తామంతా శక్తి వంచన లేకుండా పనిచేసేందుకే తాము రాజీనామా చేసినట్లు చెప్పారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల ఎంపిక

విశాలాంధ్ర-డెంకాడ: మండల పరిషత్ ప్రాంగణంలోని భవిత కేంద్రం వద్ద గురువారం దివ్యాంగుల విద్యార్థులకు ఉచిత ఉపకారణ ఎంపిక కోసం వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు సమగ్ర శిక్షణ విజయనగరం ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఏ లోవరాజు ఎంఈఓ సిహెచ్ రాధాకృష్ణ లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి దివ్యాంగులో ని ప్రత్యేక సామర్థ్యం ని వాటిని గుర్తించి ప్రోత్సహించాలని బాధ్యత మనపై ఉందన్నారు ప్రభుత్వం సమాజంలోని పాఠశాలలను వారి కోసం ప్రత్యేక సౌకర్యాలను సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు వీటిని దివ్యాంగులు సద్వినియోగం పడేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎం భారతి మాట్లాడుతూ ఉపకరణాల జాతీయ సమస్త అలింకో వారి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించబడుతున్నట్లు తెలిపారు వైద్యులు దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను నిర్ధారణ చేస్తారని వారికి వారి సూచన మేరకు అర్హుల జాబితాలను రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామని త్వరలో అర్హులందరికీ ఉపకరణాలు అందించడం జరుగుతుందని ఆమె చెప్పారు నెల్లిమర్ల భోగాపురం పూసపాటిరేగా విజయనగరం డెంకాడ మండలాల నుండి 150 మంది 3 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయసుగల దివ్యాన్ని విద్యార్థులు పాల్గొన్నారు జిల్లా ఈ కార్యక్రమంలో వైద్యులు తాజ్ కుమార్ సిహెచ్కే నాయుడు డెంకాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా...

వైసిపి అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 1వ డివిజన్ వేణుగోపాలపురంలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానికులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి దీవించారు. పూలమాలలు వేసి అభినందించారు. 2019లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే సామాన్యుడి పాలన ఏ విధంగా ఉంటుందో ప్రజలు గమనించారన్నారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో సుపరిపాలన సాగిందన్నారు. అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరాయని చెప్పారు. ఇవన్నీ గమనించి రానున్న ఎన్నికలలో మరోసారి వైసీపీని బలపరిచి, తనను శాసనసభ్యునిగా గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి డివిజన్ మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ శాసనసభ్యునిగా కోలగట్ల వీరభద్ర స్వామి గత 5 ఏళ్ళుగా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకున్నారన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. డివిజన్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి మార్గం చూపారన్నారు. మరోసారి కోలగట్ల వీరభద్రస్వామిని శాసనసభ్యులుగా గెలిపించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్ మాట్లాడుతూ నగర రూపురేఖలను మార్చి సుందరంగా తీర్చిన ఘనత కోలగట్లకే దక్కుతుందన్నారు. ప్రజల కనీస అవసరాలను తీర్చి నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని అన్నారు. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్లే నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలు చెంతనే ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించిన కోలగట్ల లాంటి వ్యక్తులను బలపరిచి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జిలు ఎస్ వి వి రాజేష్, ముచ్చు శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదరాజులగుమ్మడలో ఆలయనిర్మాణానికి లక్ష వితరణ

విశాలాంధ్ర-వంగర: మండలంలో పెదరాజులగుమ్మడ గ్రామంలో ఆలయ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన క్రీస్తుశేషులు మిర్యాల పకీరునాయుడు ˇమాస్టర్, సత్యవతి దంపతుల కుమారులు ఆలయ నిర్మాణానికి ఒక లక్షరూపాయలు విరాళంగా అందించారు. మిర్యాల నరసింగరావు, ఆయన సోదరుడు మిర్యాల వెంకటరమణ ఇరువురుప్రభుత్వ ఉద్యోగులు ఆలయనిర్మాణానికి ఈ సహాయాన్ని చేశారు. ఈ బృహత్ కార్యక్రమం నకు తమ పెద్ద మనసు చాటుకున్నారు. ఇందుకు గాను రాజుల గుమ్మడ గ్రామ కమిటీ వీరికి ప్రత్యేక ధన్యవాదములు తెలియచేశారు. ఆ కుటుంబానికి ఆయురారోగ్య, అష్టఐశ్వర్యాలుఇవ్వాలని,ఇలాంటి విరాళాలు మరిన్ని ఇవ్వగలిగే శక్తిని ఆ దేవుడు వాళ్ళకి ప్రసాదించాలని ,మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు.

పోనుగుటువలసలో కాంగ్రెస్ పార్టీ ఇంటింట ప్రచారం

విశాలాంధ్ర-రాజాం: రాజాం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంబాల రాజవర్ధన్ రాజాం మండలంలో పొనుగుటువలస గ్రామంలో ఇంటింట ప్రచారాన్ని ఈరోజు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రవేశపెట్టనున్న తొమ్మిది గ్యారెంటీలను ఇంటింటికి ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరికి వ్యక్తిగతంగా కలిసి తెలియజేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీనీ ఘన సాధించేటట్లు దీవించాలని ఆయన కంబాల రాజ వర్ధన్ కోరారు. ఆయన వెంట కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరం తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నాలుగో విడత ఎన్నికల నోటిఫికేషన్ గజపతినగరం ఎన్నికల ఉపతాసిల్దార్ గురువారం జారీ చేశారు ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు 26వ తేదీన నామినేషన్ల పరిశీలన 29న నామినేషన్ ఉపసంహరణ కు గడువు ఉంటుందన్నారు.

వృత్తి విద్యా శిక్షణలో మరుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు



విశాలాంధ్ర-గజపతినగరం: పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వృత్తి విద్య ఐటి మరియు ఐటీస్ కోర్సులలో భాగంగా గజపతి నగరంలోని చాణిక్య స్కిల్ సంస్థ ఇంటర్నె షిప్ ప్రోగ్రాంలో భాగంగా ఈనెల ఐదు నుండి 18 వరకు శిక్షణ ఏర్పాటు చేశారు శిక్షణ పూర్తయిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు సంస్థ గురువారం మరుపల్లి ఆదర్శ పాఠశాల లో ప్రిన్సిపల్ జి ఈశ్వరరావు ఆధ్వర్యంలో అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం వారి భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ట్రైనర్లు అచ్చం నాయుడు శ్రీనివాస్ మరియు ఒకేషనల్ ట్రైనర్ చిరంజీవి పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవంలో అలరించిన కోలాటం నృత్య ప్రదర్శనలు

విశాలాంధ్ర -చీపురుపల్లి: చీపురుపల్లి రుంకాన వీధి లో గల శ్రీ దత్త సాయి మందిరములో బుధవారం రాత్రి శ్రీరామనవమి సందర్భముగా రాత్రి 10.00 గం.లు సమయమున ఉరుసు ఉత్సవముల అత్యంత వైభవంగా, పసుల పండుగ జరిగాయి. ఈ ఉరుసు ఉత్సవములు లొ రాజాం వాస్తవ్యులు కొత్త బిందు,కొల్లార్ శాంతి అవుతూ (ఎస్‌వివిఎపిఎస్) బృందం వారిచే కోలాటం మరియు సాంస్కతిక నృత్య ప్రదర్శన కడు రమ్యముగా ప్రదర్శించినారు. పిల్లపేట వారిచే కోలాటం, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. ఊరేగింపులో చీపురుపల్లికి చెందిన కెల్లా గోపి దంపతల కుమార్తె నృత్య ప్రదర్శన పలువురుని ఎంతగానో ఆకట్టుకున్నది. ముస్లిం సాంప్రదాయ సందర్భముగా (ఉరుసు) చందనోత్సవము కార్యక్రమములో చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి, మహారాష్ట్రలోని షిర్డీ సంస్థానము షిర్డీ సాయి మందిరములో ప్రదాన అర్చుకులుగా సేవలు చేసిన శ్రీ ప్రమోద్ మేది మందిరం కార్యనిర్వహకులు తంగుడు రామకృష్ణ ప్రముఖ వ్యాపారవేత ఏ ఎన్ వి ప్రసాద్ తదితరులు కార్యక్రమంలొ పాల్గొన్నారు. ఇటివల జరిగిన జాతీయస్థాయి అందాల పోటీలు లలో మిస్ ఇండియా బ్యూటి విట్ హర్ట్ మరియు చార్మి 2 టైటిల్స్ కి ఎంపికైన కో ణతాల భాగ్యలక్ష్మి కోణతాల సంతోష్ కుమార్ దంపతులు తొపాటు మిస్ ఇండియా కిరిటం గెలిచినా విజేత.లకు దత్తసాయి మందిరంలో ఈ సందర్భంగా ఘన సన్మానం చేసి సత్కరించిరి అలాగే ప్రమోద్ మేది కి చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జ్ విజయ రామేశ్వరికి, మిస్ ఇండియా శ్రీమతి కొణతాల భాగ్యలక్ష్మి సంతోష్ కుమార్ దంపతులు చిత్రపటాన్ని బహుకరించి సన్మానరించిరి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం భక్తులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట విద్యుత్ సబ్‌స్టేషన్లో అదనపు 5 ఎం.వి.ఏ. పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం దృష్ట్యా వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా మరియు ముందస్తుగా పెరిగే వినియోగం దృష్ట్యా అదనపు 5 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ను ఎస్.కోట సబ్ స్టేషన్ వద్ద సుమారు కోటి 25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ విజయనగరం జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ మువ్వల లక్ష్మణరావు తెలిపారు. ఆయన గురువారం మధ్యాహ్నం ఎస్.కోటలో ఏర్పాటు చేసిన అదనపు 5 ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్ బాబు, ఎంఅండ్ పిటిఆర్ఇ ఈఈలు కె.వి.ఎస్. సత్యనారాయణ, డి.ఫణి కిరణ్ కుమార్, ఎస్.కోట డి.ఈ బి.వెంకటరావు, ఏఈ ఆర్.రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు నివారణపై ప్రయివేటు ఆసుపత్రి సిబ్బందికి అవగాహన

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, శృంగవరపుకోట అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్రిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం ఎస్.కోట పట్టణంలోని సంజీవని సూపర్ స్పెషలిస్ట్ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందికి ఫైర్ పరికరాలతో అగ్ని ప్రమాదాలు సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి అగ్నిమాపక అధికారి షేక్ మదీనా వివరించారు. అలాగే సిబ్బంది చేత ఫైర్ డ్రిల్స్ నిర్వహించి అవగాహన కల్పించారు.

ప్రతిపక్షాల తప్పుడు వ్యాఖ్యలకు మనస్థాపంతోనే మూకుమ్మడి రాజీనామాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధులుగా, సమాజ సేవకులుగా ఉన్న వాలంటీర్లు తమ రాజీనామాలను సమర్పిస్తున్నారు. ఇన్నాళ్లూ నిస్వార్థంగా సేవలు అందించిన వారంతా ప్రతిపక్ష నాయకులు చేస్తున్న లేనిపోని ఆరోపణలకు మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నారు. గురువారం మండల పరిధిలో 53 నగర పరిధిలో 51 మంది వాలంటరీ పదవులకు రాజీనామాలు చేశారు. అధికారులకు తమ రాజీనామాలను సమర్పించి విధుల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు. కొండకరకం నుండి 12 మంది, గుంకలాం నుండి 14, ద్వారపూడి 13, నారాయణపురం 7, ముడుదాం నుండి ఏడుగురు రాజీనామాలు చేశారు. అలాగే నగర పరిధిలో 37వ డివిజన్ బీసీ కాలనీ నుండి 15 మంది, మూడో డివిజన్ పూల్బాగ్ నుండి 8 మంది, 14వ డివిజన్ కుమ్మరి వీధి నుంచి 18 మంది, 17వ డివిజన్ పుచ్చల వీది నుండి పదిమంది రాజీనామాలను సమర్పించారు.ఈ సందర్భంగా వాలంటీర్లు మీడియాతో మాట్లాడుతూ 58 నెలలపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చామన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నామన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చామన్నారు. అయితే తమ నిస్వార్థసేవలపై చంద్రబాబు ఇతర ప్రతిపక్ష నాయకులు తప్పుడు వ్యాఖ్యలుచేయడం ఎన్నికలవేళ సేవలకు అభ్యంతరం చెప్పడంతో మనస్థాపానికి చెందామన్నారు. మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామన్నారు. సేవకులుగా ఎదిగేందుకు అవకాశం కల్పించిన నాయకులకు మద్దతుగా అడుగులు వేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసుకొని వాలంటరీ వ్యవస్థను బతికించుకునేందుకు రాజీలేని పోరాటం చేస్తామని బూనారు.

ఫారం-1 నోటీసును విడుదల చేసిన రిటర్నింగ్ అధికారి

విశాలాంధ్ర -శృంగవరపుకోట : ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయంలో ఫారం-1 నోటీసును నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ గురువారం విడుదల చేసి నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు: ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర -రాజాం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక సన్‌స్కూల్‌లో ప్రమాదాల నివారణపై స్థానిక అగ్నిమాపక అధికారి ఎస్. జనార్ధనరావు ఆధ్వర్యంలో సిబ్బంది డెమో ఇచ్చారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, ప్రమాదం సంభవిస్తే, వెంటనే చేపట్టాల్సిన చర్యల గూర్చి వివరించారు. ఇదే సందర్భంలో ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడంపై కూడా అవగాహన కల్పించారు.

జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు

విశాలాంధ్ర-విజయనగరం,: జిల్లా వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. వీరిని జెడ్పీ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని ఎన్నికల పరిస్థితిని, తీసుకున్న చర్యలను వివరించారు. వీరి వెంట లైజన్ ఆఫీసర్లు కూడా ఉన్నారు.

జాతీయ జనసేన పార్టీ నుంచి యాళ్ళ వెంకటరావు నామినేషన్ దాఖలు..

విశాలాంధ్ర-శృంగవరపుకోట : కొత్తవలస మండలం, కంటకాపల్లి పంచాయతీ శివారు కొత్తూరు గ్రామానికి చెందిన యాళ్ళ వెంకటరావు జాతీయ జనసేన పార్టీ నుండి గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ తెలియజేశారు. ఎన్నికల్లో గెలిచినట్టయితే నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతామని అభ్యర్థి యాళ్ళ వెంకటరావు వెల్లడించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బాడంగి : పురుగుల మందు తాగి బాడంగి మండలం చిన భీమవరం గ్రామానికి చెందిన ఉయ్యాల నూకందొర మృతి చెందరని ఎస్.ఐ జయంతి తెలిపారు.ఆమె అందించిన వివరాల ప్రకారం మృతుడు బహిర్భూమికి వెళ్ళి పురుగుల మందు తాగారు.ఈ విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాడంగి ఆస్పత్రికి తరలించారు. మెరిగైన చికిత్స నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందిస్తూ ఉండగా విజయనగరం ఆస్పత్రిలో బుధవారం రాత్రి చనిపోయారని ఆమె తెలిపారు. మృతుడు భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రచారరథం ఢీకొని యువకుని మృతి

విశాలాంధ్ర-రాజాం: విజయనగరం జిల్లా రాజాంలో ఓ ప్రచార రథం ఢీకొని లచ్చయ్య పేటకు చెందిన యువకునికి గాయాలు. రాజాం ప్రాంతీయ హాస్పిటల్ కి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు పేరు భరద్వాజ్ వయసు పది సంవత్సరాలు.తండ్రి పేరు వెంకటేష్ తల్లి సంతు...

మండిపోతున్న ఎండలు...

ప్రచార కార్యక్రమాలలో అభ్యర్థులకు చెమటలు.

ఉదయం 10 నుండి సాయంత్రం 4 వరకు బయటికి వెళ్లొద్దని హెచ్చరికలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గత మూడు రోజులుగా ఎండలు భగభగ మండిపోతున్నాయి ఒకసారి గా పెరిగిన ఈ ఉష్ణతాపానికి ప్రజలు అనేక అవస్థలకు గురి అవుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు తమ ప్రచారాలకు కూడా వెళ్లేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అభ్యర్థులు వెంట కార్యకర్తలు రాదానికి కూడా ఈ ఎండలకు భయపడి పెద్దగా ఆసక్తి చూపటం లేదు. ఏప్రిల్ నెలలోనే జిల్లా వ్యాప్తంగా ఎండలు ఈ విధంగా మండిపోతుంటే రానున్న కాలంలో ఏ విధంగా ఉంటాదో అని ప్రజలంతా భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ముఖ్యంగా గత మూడు రోజులగా 40 డిగ్రీల దాటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలంతా అల్లాడిపోతున్నారు.ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసర సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో ఇంటికి పరిమితం అవ్వాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.ఎండలు తీవ్రత పిల్లలు, వృద్ధులపై తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున సాధ్యమైనంత వరకు పిల్లలు వృద్ధులు బయటికి వెళ్లకుండా చూసుకోవాలని వైద్యులు తెలుపుతున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున బయటికి వెళ్లిన వారంతా మంచినీళ్లు,మజ్జిగ, గంజి , నిమ్మరసం వంటివి తీసుకుంటే మంచిది శరీరంలో నీరు చెమట రూపంలో బయటకు పోయి డిహైడ్రేషన్ అయ్యే ప్రమాదం ఉన్నందున ప్రతి అరగంటకు ఒకసారి మంచినీళ్లు మజ్జిగ లేదా చల్లని పానీయాలు తీసుకోవడం మంచిది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బయటికి వెళ్లే సమయంలో గొడుగు తెల్లని పలుచటి చేనేత వస్త్రం ధరించడం మంచిది. దూరప్రాంతాలకు వెళ్లే వాళ్లంతా ఉదయం లేదా సాయంత్రం వెళ్లాలని పలువురు తెలుపుతున్నారు ఈ ఎండల తీవ్రతకు ముఖ్యంగా రిక్షా,ఆటో సామాన్య కార్మికులంతా తీవ్ర అవస్థలకు గురి అవుతున్నారు. ప్రస్తుతం ఎండల వేడి కన్నా ఎన్నికల వేడి మహా ఆసక్తిగా ఉంది. ...